క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11కేవీ ఎల్‌బీనగర్, ఆలిండియా రేడియో, హుడా సాయినగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పర్యావరణాన్ని కాపాడండి



మొక్కలు నాటుతున్న కాలనీ వాసులు, చిత్రంలో మేయర్ పారిజాత

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడుకునేందుకు మొక్కలు నాటి, పెంచి పెద్ద చేయాలని మేయర్ చిగురింత పారిజాత కోరారు. బడంగ్‌పేట కార్పొరేషన్ 23వ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమంలో మేయర్ పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం జై హనుమాన్ పేరుతో ఏర్పాటు చేసిన మినీ క్రికెట్ స్టేడియంను ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సంతోషి, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌కుమార్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పాలంకరణ తదితర పూజలు నిర్వహించారు. శివుడికి పూలతో అభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారికి భక్తులు పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్ గౌడ్, డైరెక్టర్లు, పూజారులు తదితరులు పాల్గొన్నారు.

బీరప్ప ఉత్సవాలకు రండి



దత్తాత్రేయను ఆహ్వానిస్తున్న శంకర్‌రెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: బడంగ్‌పేట కార్పొరేషన్ మల్లాపూర్‌లో నిర్వహించనున్న బీరప్పస్వామి ఉత్సవాలకు రావాలని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను బీజేపీ రాష్ట్ర నేత కొలన్ శంకర్‌రెడ్డి ఆహ్వానించారు. ఈ నెల 14,15 తేదీల్లో జరగనున్న జాతరకు విచ్చేసి, ఈ ప్రాంతవాసులను ఉత్తేజ పరచాలని కోరారు. ఆహ్వానించిన వారిలో ఉత్సవ సమితి సభ్యులు నర్రా గోపాల్, గుండ్ల శ్రీశైలం, మేకల శ్రీనివాస్, రాజు, తనాజీ తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల మౌన ప్రదర్శన



వినూత్నంగా నిరసన తెలుపుతున్న వీఓఏలు

కందుకూరు: తమ సమస్యలు పరిష్కారించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో వీఓఏలు మండల కేంద్రంలో చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి 20వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా వీఓఏలు నోటికి నల్లటి వస్త్రం కట్టుకుని చౌరస్తాలో మౌన ప్రదర్శన చేసి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు బాలరాజు మాట్లాడుతూ.. వీఓఏలు సుదీర్ఘ సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. వీఓఏలకు సంఘీభావంగా మహిళా మ్యాక్స్ సభ్యులు శివలీల, కవిత, మణెమ్మ, మౌనిక, బీఓడీలు, ఈసీ సభ్యులు పాల్గొన్నారు. వీఓఏలు సరస్వతి, పద్మ, రమ్య, సంగీత పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంటివెలుగు

ఆమనగల్లు: విఠాయిపల్లి గ్రామంలో కంటివెలుగు కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం డా.పరిక్షిత్ నరేందర్, మంజులదేవిల ఆధ్వర్యంలో 181 మందికి కంటి పరీక్ష చేశారు. కౌన్సిలర్ సుజాత, ఆసుపత్రి సిబ్బంది తిరుపతిరెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

దారంతా గుంతలమయం

- అధ్వానంగా విజ్ఞానపురికాలనీ కూడలి
- ప్రమాదాలకు నిలయంగా రహదారి
- మరమ్మతులు చేయాలంటున్న స్థానికులు



గుంతలమయంగా ఉన్న ప్రధాన రహదారి కూడలి

మీర్‌పేట: ప్రధాన కూడలి రహదారులు అధ్వానంగా మారాయి. మరమ్మతులు చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు నరకం చూస్తున్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి విజ్ఞానపురికాలనీ చౌరస్తాలోని ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. సాగర్ హైవే నుంచి మీర్‌పేట, అల్మాస్‌గూడ, బడంగ్‌పేట వైపు వెళ్లే వాహనాలు ఈ కూడలి నుంచే వెళ్లాల్సి ఉండగా.. నిత్యం ఆ రహదారి వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటోంది. దారంతా గుంతలమయంగా ఉండడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఏటా కూడలి రహదారికి మరమ్మతులు చేయడం.. ఆ తరువాత వర్షాలకు కంకర తేలి గుంతలు ఏర్పడటం పరిపాటిగా మారిందని స్థానికులు చెబుతున్నారు. రహదారిని అభివృద్ధి చేయాలని కార్పొరేషన్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపించారు. నందిహిల్స్ రహదారిని అభివృద్ధి చేసిన అధికారులు.. విజ్ఞానపురికాలని కూడలిని కూడా అభివృద్ధి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రమాదాలకు నిలయం..

రహదారి అధ్వానంగా ఉండడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో ఇదే చౌరస్తాలో ఓ వాహనదారుడు అదుపుతప్పి కింద పడ్డాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న టిప్పర్ అతని పై నుంచి వెళ్లడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడని స్థానికులు తెలిపారు. రహదారిని అభివృద్ధి చేసి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి



ఆటపాట కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

మీర్‌పేట: కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ప్రకాష్‌కారత్ డిమాండ్ చేశారు. మేడే వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మీర్‌పేట చౌరస్తాలో ఆటపాట నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కనీసం వేతనం అమలుతో పాటు, మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.6 లక్షల బీమా సౌకర్యం ప్రభుత్వం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, యాదగిరి, పెంటయ్య, యాదగిరి, ప్రభాకర్, కమలమ్మ, యాదగిరిచారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తిరు కల్యాణోత్సవం



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ తదితరులు

కందుకూరు: ముచ్చర్ల అనుబంధ గ్రామం ఊట్లపల్లిలో లక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. లక్ష్మయ్య ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా శుక్రవారం స్వామి వారి తిరు కల్యాణోత్సవాన్ని వేద బ్రాహ్మణులు మంత్రోచ్ఛారణల నడుమ వైభవంగా నిర్వహించారు. ఉత్సవంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్ తదితరులు పాల్గొని పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు.

సబితకు శుభాకాంక్షలు



క్యాంపు కార్యాలయం వద్ద కరవాలం చూపుతున్న మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి జన్మదిన వేడుకలను మీర్‌పేటలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. పలువురు నాయకులు మంత్రికి నోటుపుస్తకాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయనని సబిత ఈ సందర్భంగా చెప్పారు. ప్రజాసేవలో మరింత బాధ్యతతో ముందుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు రక్తదానం చేశారు. వేడుకల్లో మీర్‌పేట కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, పార్టీ అధ్యక్షుడు కామేష్‌రెడ్డి, నియోజకవర్గ యువ జన విభాగం అధ్యక్షుడు పవన్‌కుమార్ పాల్గొన్నారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

కడ్తాల్: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. శుక్రవారం ఏక్వాయిపల్లిలో సర్పంచ్ సుగుణతో కలిసి కంటివెలుగు కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. అంధత్వ నివారణే లక్ష్యంగా ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని,కంటి సమస్యలతో బాధపడుతున్న వారు నేత్ర శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఉమావతి, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, స్థానిక నాయకులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో ఈనెల 6న ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించడానికి వివిధ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుని ఈ మేళా ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. అర్హత కలిగిన యువత కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సర్వసభ్య సమావేశం నేడు

తలకొండపల్లి: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కుర్మిద్దలో శాంతిహోమం

యాచారం: కుర్మిద్దలో శుక్రవారం శాంతి హోమం ఘనంగా నిర్వహించారు. పురాతన సత్యనారాయణస్వామి దేవాలయాన్ని పునర్నిర్మించనున్న నేపథ్యంలో ఆ భవనం కూల్చివేతకు ఏర్పాట్లు చేశారు. అందులో భాగంగా పూజారి రాజేశ్వర్‌శర్మ ఆధ్వర్యంలో దేవాలయ ఆవరణలో శాంతిహోమం చేసి, దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించా రు. అనంతరం ఆలయాన్ని కూల్చి వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బందె రాజశేఖర్‌రెడ్డి, గ్రామస్తులు మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ఇబ్రహీంపట్నం రూరల్: వేంకటేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి శుక్రవారం ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి అనుబంధ గ్రామం మన్నెగూడలో భూమిపూజ చేశారు. సర్పంచ్ అండాలు, ఎంపీటీసీ మంగ చేతుల మీదుగా భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకుడు యాదిరెడ్డి, గ్రామ పెద్దలు రవీందర్‌రెడ్డి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థి గృహం అద్భుత శరణాలయం



అనాథ విద్యార్థి గృహంలో మొక్కలు నాటుతున్న శ్రీనివాస్ గుప్తా

దిల్‌సుఖ్‌నగర్: అనాథ విద్యార్థులను చేరదీసి, కార్పొరేట్ స్థాయి వసతులు, విద్యా సౌకర్యాలు కల్పించి, వారి భవిష్యత్‌కు అహర్నిశలు కృషి చేస్తున్న గృహ కమిటీని తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అభినందించారు. శుక్రవారం ఆర్‌కేపురం డివిజన్‌లోని చిత్రా లే అవుట్‌లోని అనాథ విద్యార్థి గృహంలో బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగ నాయకుడు లోకేష్ ఆధ్వర్యంలో శ్రీనివాస్ గుప్తా జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనాథ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం గృహం విద్యార్థులకు అన్నాదానం చేశారు. కార్యక్రమంలో గృహ అధ్యక్షుడు మార్గం రాజేష్, ఎల్‌బీఆర్ బీఆర్ఎస్ విద్యార్థి విభాగ నాయకులు, అనాథ గృహ విద్యార్థులు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలతో తీర్చిదిద్దుతాం

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: తెలంగాణ ముఖద్వారమైన ఎల్‌బీనగర్ చౌరస్తాలో మహనీయుల విగ్రహాలను పునఃప్రతిష్ఠించి అందంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గడ్డిఅన్నారంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన దళిత సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎల్‌బీనగర్ చౌరస్తాలో అండర్‌పాస్, ఫ్లైఓవర్ నిర్మాణం చేపడుతున్న సమయంలో అక్కడ ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను కామినేని ఆసుపత్రి రహదారిపై తాత్కాలికంగా ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం చౌరస్తాలోని అండర్ పాస్, ఫ్లైఓవర్ పనులు పూర్తి కావడంతో ఆ మహనీయుల విగ్రహాలతో పాటు జ్యోతిరావ్ పూలే, శ్రీకాంత చారి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలను పునః ప్రతిష్ఠించి చౌరస్తాను అందంగా తీర్చిదిద్దుతానని అన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల ప్రతినిధులు చిరంజీవి, ఆడాల రమేష్, గుంటి లక్ష్మణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలి



కడ్తాల్: సమ్మెకు సంఘీభావం తెలిపిన కాంగ్రెస్ నేతలు

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్: ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు ప్రొబేషనరీ కాలం పూర్తయిన జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం టీపీఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కందుకూర్, మహేశ్వరం, కడ్తాల్, ఆమనగల్లు, తలకొండపల్లిలో జేపీఎస్‌లు చేపట్టిన సమ్మెకు కాంగ్రెస్ నేతలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. జేపీఎస్‌ల సమ్మెతో గ్రామాల్లో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించి, పరిష్కరించాలని కోరారు. మండల కేంద్రంలో జేపీఎస్‌ల ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం, అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. టీపీఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షుడు జావిద్, జేపీఎస్ సంఘం మండల అధ్యక్షుడు రమేశ్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, రాంచందర్‌నాయక్, యాదయ్యగౌడ్, యాదయ్య, కృష్ణ, జేపీఎస్ నాయకులు శివకుమార్, మరళీమోహన్, వాజిద్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: సమస్యలు పరిష్కరించాలంటూ జేపీఎస్‌లు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరవధిక చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు కార్యదర్శులు మాట్లాడుతూ తమను క్రమబద్ధీకరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా నృసింహస్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: లక్ష్మీ నృసింహస్వామి కల్యాణ మహోత్సవం శుక్రవారం పోచారం గ్రామంలో కన్నుల పండువగా జరిగింది. గ్రామంలోని పురాతన దేవాలయంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ వేడుకలు నిర్వహించారు. ఈ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి విచ్చేసి స్వామి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్, మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్ రెడ్డి, ఎంపీపీ కృపేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రాంరెడ్డి, సర్పంచ్‌లు కవిత, అరుణ, గీత తదితరులు పాల్గొన్నారు.

నేలకూలిన భారీ వృక్షం



రోడ్డుపై విరిగిపడిన చెట్టు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ వేంకటేశ్వరకాలనీ రోడ్ నెం 8లో ట్రక్కు ఢీ కొట్టడంతో భారీ వృక్షం నేల కూలింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి.. డీఆర్ఎఫ్ బృందం సహాయంతో చెట్టును తొలగించారు.

శిక్షణ శిబిరాలు విద్యార్థులకు మేలు



జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

కడ్తాల్: వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థులకు ఎంతో మేలు చేస్తాయని, వాటి వలన విజ్ఞానం, వికాసం, ప్రశాంతత లభిస్తుందని ఎంపీపీ కమ్లీ మోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండల విద్యా వనరుల కేంద్రంలో శృతి లయ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్ జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారుల్లో దాగున్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ శిక్షణ శిబిరాలు తోడ్పతాయని, వాటిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవేందర్, సలహాదారు తిరుపతిగౌడ్, అకాడమీ ఇన్‌చార్జీలు సాగదేవత, స్వాతి తదితరులు ఉన్నారు.

నిరుద్యోగులను మోసగించిన ప్రభుత్వం

పీసీసీ ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి



మాట్లాడుతున్న పీసీసీ ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: నిరుద్యోగులను మోసం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వినోద ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం ఇస్తే తెలంగాణలో నిరుద్యోగ సమస్య తీరుతుందని, వెనుకబడ్డ ఈ ప్రాంత ప్రజలు బాగుపడుతారని సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని తెలిపారు. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగులను మోసగించిందని, ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి చెల్లించాలన్నారు.

ప్రియాంక సభను సక్సెస్ చేయాలి

నిరుద్యోగుల సమస్యపై ఈ నెల 8వ తేదీ సాయంత్రం 4 గంటలకు సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహిస్తున్న ప్రియాంక గాంధీ బహిరంగసభకు, నియోజకవర్గం నుంచి విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మల్‌రెడ్డి అన్నారు. సమావేశంలో పార్టీ పరిశీలకుడు సంజీవ, నేతలు శేఖర్‌గౌడ్, గురునాథ్‌రెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



యాచారం: ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీపీ సుకన్య తదితరులు

తలకొండపల్లి: రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని, రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం.. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని చెప్పారు. శుక్రవారం చుక్కాపూర్‌లో సర్పంచ్ కిష్టమ్మ, సింగిల్‌విండో డైరెక్టర్ మావిళ్లపల్లి వెంకట్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం సూచించిన నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ ధాన్యం విక్రయించాలని రైతులకు సూచించారు. ఏగ్రేడ్ ధాన్యం ధర రూ.2,060, బిగ్రేడ్‌కు ధర రూ.2,040 చొప్పున ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, జీరానాయక్, శ్రీను, మల్లేశ్, మల్లారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, జంగయ్య, రవి, శ్రీనాథ్, భరత్, లావణ్య, సత్తిరెడ్డి, అశోక్‌రెడ్డి, భీష్మాచారి, కర్నాకర్‌రెడ్డి, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతుల పట్ల చిన్నచూపు తగదు

యాచారం: ధాన్యం విక్రయించే రైతుల పట్ల నిర్వాహకులు చిన్నచూపు చూడవద్దని ఎంపీపీ కొప్పు సుకన్య అన్నారు. చింతపట్ల గ్రామంలో శుక్రవారం ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నందున తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, కేంద్రాల్లో రైతులకు తగిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు జంగమ్మ, చింతపట్ల సర్పంచ్ సరిత, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మమ్మ, ఐకేపీ ఏపీఎం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: జిల్లా సహకార మార్కెట్ సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ స్రవంతి, మండల రైతు సమితి అధ్యక్షుడు అంజిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వెంకటేశ్, కిరణప్ప, శ్రీనివాస్‌గుప్తా పాల్గొన్నారు.